# సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకుడు
# కా॥యద్దనపూడి సోనీకి విప్లవ జోహార్లు



**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకుడు, కార్మిక, రైతు, కూలీ, ప్రజా ఉద్యమనేత, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి, కా॥యద్దనపూడి సోనీ(60 సం॥లు) గుండె సంబంధిత వ్యాధికి చికిత్సపొందుతూ 19-2-18 రాత్రి 7.30కు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. కామ్రేడ్ సోనీ మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది. కామ్రేడ్ సోనీకి విప్లవ జోహార్లర్పిస్తోంది.**

1958 సం॥లో ఆస్తిక భావాలున్న సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన కా॥యద్దనపూడి సోనీ(సోమేశ్వర జానకీరాం) బందరులో డిగ్రీ చదువుతున్న కాలంలోనే నాస్తికభావాలవైపు, తర్వాత నాటి డిఎస్ఓ పరిచయాల్లోకి వచ్చారు. మార్క్సిజాన్ని అవగాహన చేసుకుంటూ 1980 సం॥నాటికి విప్లవమే వృత్తిగా, విప్లవ రాజకీయాచరణకు జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు.

బందరు ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణ బాధ్యతలలో భాగంగా పట్టణంలో విద్యార్థుల, శ్రామిక యూనియన్ల ఏర్పాటుతోపాటు పేదల నివాసకాలనీల ఏర్పాటుకు నాయకత్వం వహించారు. బందరు పరిసర తీరప్రాంత గ్రామాలలో పల్లెకారుల, రైతాంగ - భూమి, హక్కుల సమస్యలపై నిరంతర రాజకీయ, ఉద్యమ, నిర్మాణ కృషిసాగించారు. దీనికి కళారంగాన్ని సృజనాత్మకంగా జోడించి ప్రజలను విస్తృతంగా సమీకరించి, ఆందోళనా క్రమంలో ప్రజలు అనేక విజయాలు సాధించుకునేందుకు నేతృత్వం వహించారు.

కామ్రేడ్ సోనీ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానానికి నిబద్ధుడై, పార్టీ నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడి కడదాకా కృషిసాగించారు. పెడధోరణులకు, సిద్ధాంత గందరగోళాలకు వ్యతిరేకంగా ఆంతరంగికంగా జరిగిన సంఘర్షణల్లో సరైన వైఖరులను నిలబెట్టటంలో వ్యక్తిగత సాన్నిహిత్యాలను సైతం లెక్కచేయక కా॥ సోనీ దృఢంగా నిలిచారు. పార్టీ సిద్ధాంతం, ప్రజాయుద్ధపంథా ఆచరణలపై భావజాలపరంగా జరిగే దాడులను సమర్థంగా తిప్పికొట్టారు.

ఉద్యమక్రమంలో కా॥సోనీపై, ఇతర కామ్రేడ్స్‌పై రౌడీగూండాలు భౌతిక దాడులకు పాల్పడినా, దుష్ప్రచారాలు చేసినా వెరవలేదు. పోలీసుల వేధింపులకు, అక్రమకేసులకు జంకలేదు. నిరంతర కార్యాచరణతో ఈ అడ్డంకులన్నీ ఎదుర్కొంటూ కా॥సోనీ నాయకత్వంలో ప్రజలు ఉద్యమాన్ని కాపాడుకున్నారు.

కృష్ణాజిల్లాలో పార్టీ నిర్మాణ బాధ్యతలతోపాటు, రాష్ట్రస్థాయిలో 1986 సం॥లో ఏర్పడిన రైతుకూలీ పేదలసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా, విప్లవసంఘాల విలీనం తర్వాత రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకోశాధికారిగా, మరణించే సమయానికి సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శిగా కా॥సోనీ బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలోనూ, ఆయా జిల్లాలలోనూ జరిగిన రైతు, కూలీ, ఆదివాసీ, ప్రజాఉద్యమాలకు అండదండగా కా॥సోనీ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

వివిధ జిల్లాలలోని కార్మిక యూనియన్లు పునస్సంఘటితమై 2008లో రాజమండ్రిలో జరుపుకున్న ఏపిఎఫ్‌టియు రాష్ట్రమహాసభలో కా॥సోనీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. తదనంతర కాలంలో విప్లవ కార్మిక సంస్థల ఐక్యతతో ఏర్పడిన ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శిగా 2016 వరకు కా॥సోనీ బాధ్యతలు నిర్వహించారు. తన అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నలుమూలులా పర్యటించి కార్మికుల ఆందోళనలకు దన్నుగా నిలిచారు.

సునిశిత పరిశీలన, రాజకీయ చతురత, అన్వయింపు, హాస్యధోరణి, సృజనాత్మకత మెండుగా కల కా॥సోనీ చైతన్యరథం, ధరలు బాబోయ్ ధరలు, పరిపాలనాచక్రం, ప్రతిభా ఓ ప్రతిభా, అణుభూతం వంటి పలు వీధినాటికల రూపకల్పనలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ప్రజాకళాకారునిగా రాష్ట్రవ్యాపితంగా వందలాది వీధినాటిక ప్రదర్శనలలో పాత్రధారిగా కా॥సోనీ మన్ననలు పొందారు.

**కా॥సోనీ మృతికి సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిస్తోంది. కామ్రేడ్ సోనీ కుటుంబ సభ్యులకు తన తీవ్ర సంతాపాన్ని తెలియపరుస్తోంది.**

**విజయవాడ** — **సిపిఐ(ఎం-ఎల్)**

**20-2-18** — **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ**